ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
సోమవారం 29 జనవరి 2024

కార్పొరేషన్ చైర్మన్ వద్దు : బాగేపల్లి ఎమ్మెల్యే

బాగేపల్లి, జనవరి 28: మంత్రివర్గంలో స్థానం కోసం ఆశలు పెట్టుకున్న చిక్కబళ్లాపుర జిల్లా బాగేపల్లి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి అగ్రనేతల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం వ్యక్తిగత కార్యదర్శి ద్వారా అభిప్రాయాన్ని ప్రకటింపచేశారు. సుబ్బారెడ్డికి సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కేటాయిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సుబ్బారెడ్డి మంత్రి పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. మంత్రి పదవి లేదంటే బోర్డులు, కార్పొరేషన్ పదవులు తీసుకునేది లేదని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి నుంచి మొబైల్ స్విచ్ఛాఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయినట్టు సమాచారం.

కులాల పేరిట చీల్చేవారికి... బుద్ధి చెప్పండి




సదస్సు ప్రారంభంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు, చిత్రదుర్గలో భారీగా హాజరైన ప్రజలు

- కేంద్రంలో కాంగ్రెస్ వస్తే... దేశమంతటా కులగణన
- అణగారినవర్గాల అభివృద్ధికి కట్టుబడ్డాం
- చిత్రదుర్గ సదస్సులో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కులం, మతం పేరిట సమాజాన్ని చీల్చేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను తిరస్కరించాలని, వారికి తగిన గుణపాఠం చెప్పాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పిలుపునిచ్చారు. చిత్రదుర్గలో ఆదివారం అణగారిన వర్గాల జాగృతి సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలు తరలివచ్చారు. సమావేశంలో సీఎం మాట్లాడుతూ బీసీలు, ఎస్సీలు, అణగారిన వర్గాలు తమ శత్రువు ఎవరనేది తెలుసుకోవాలని సూచించారు. వారిని సంపూర్ణంగా తిరస్కరించి ఆత్మాభిమానాన్ని చాటుకోవాలన్నారు. రాజ్యాంగాన్ని మనం రక్షిస్తే హక్కుల ద్వారా మన మనుగడ సాధ్యమవుతుందన్నారు. మండల్ నివేదికను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకిస్తూ వచ్చాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలను వారు వ్యతిరేకించారని తెలిపారు. రాజ్యాంగం, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం ప్రత్యర్థుల చేతికి దక్కరాదంటే అధికారంలోకి వారు రాకూడదని అంబేడ్కర్ హెచ్చరించారనే అంశాన్ని విస్మరించరాదన్నారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం లేకుంటే ఈశ్వరప్ప, సీటీ రవి, అశోక్ ఎమ్మెల్యేలుగా శాసనసభలోకి ప్రవేశించే అవకాశం లేదని, ఎవరో పొలంలో కూలీలుగా మిగలాల్సి ఉండేదని సీఎం ఎద్దేవా చేశారు. గొర్రెల కాపరి కొడుకు సీఎం అయ్యాడని, పట్టభద్రులు తనను వ్యతిరేకించారని గుర్తు చేసుకున్నారు. కులమత వర్గ తేడాలు లేకుండా పేదలకు అనుకూలమయ్యేలా పథకాలను తీసుకొచ్చినందుకు తనను కొందరు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. అన్నభాగ్య, షూ భాగ్య, యూనిఫాం వంటివి అందరికీ సమానంగా అందజేశామన్నారు. కులాల మధ్య వ్యత్యాసం, తక్కువ కులమనే దూషణలు, అసమానత సమాజంలో తొలగేంతవరకు ఇటువంటి సమావేశాలు అనివార్యమని తెలిపారు. కులం కులం అంటూ కొట్టుకోరాదని కనకదాసు పిలుపునిచ్చారని తెలిపారు కుల వ్యవస్థకు కారణం శతాబ్దాల కాలంగా అణగారిన వర్గాలపై వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయని, అక్షరాభ్యాసం లేనందునే సమానత్వం లేకుండా పోయిందన్నారు. అంబేడ్కర్, సాహి మహరాజ్, జ్యోతిబాఫూలే, బుద్ధ, బసవణ్ణ, నారాయణ గురు, నాల్వడి కృష్ణరాజ ఒడయార్, వివేకానంద, కనకదాసు వంటివారు కులవ్యవస్థ నిర్మూలనకు శ్రమించారన్నారు. మన రాజ్యాంగం మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ఉందన్నారు. దుష్టశక్తులు రాజ్యాంగం మార్పు వంటి అంశాలను ప్రస్తావిస్తుంటాయని, వాటికి గుణపాఠం ఓటు ద్వారానే చూపాలని పిలుపునిచ్చారు. చిత్రదుర్గలో జరిగిన భారీ సభలో పాల్గొనే వారికోసం భారీగా భోజన ఏర్పాటు చేశారు. 33వేల కిలోల చికెన్‌తో బిర్యానీ వండారు. సుమారు రెండున్నర లక్షల మందికిపైగా బిర్యానీని పంచారు. 150 మంది వంటమనుషులు శనివారం రాత్రి నుంచి పనిచేశారు. వెయ్యి కౌంటర్ల ద్వారా బిర్యానీ పంపిణీ చేయగా నాలుగైదు కౌంటర్లలో శాకాహారాన్ని అందచేశారు. 150 ఎకరాల విస్తీర్ణంలో సమావేశ వేదిక ఏర్పాటు చేయగా ప్రధాన వేదికపై 270 మంది ఆశీనులయ్యేలా తీర్చారు.

కేంద్రంలో కాంగ్రెస్ వస్తే దేశమంతా కులగణన

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశమంతటా కులగణన అమలు చేస్తామని అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిందంటే అమలు చేసి తీరుతుందన్నారు. రాష్ట్రంలో కులగణన కోసం నియమించిన కాంతరాజ్ కమిటీ నివేదికను స్వాగతిస్తామన్నారు. అణగారిన వర్గాల మహా కూటమి అధ్యక్షుడు రామచంద్రప్ప సభకు అధ్యక్షత వహించగా, దళిత సంఘర్ష సమితి ముఖ్యులు మావళ్లి శంకర్, మాజీ మంత్రి హెచ్. ఆంజనేయులు అణగారిన వర్గాల హక్కులు, డిమాండ్లపై నివేదికను ముఖ్యమంత్రికి అందించారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు మహదేవప్ప, సతీశ్ జార్కిహొళి, బోస్‌రాజు, సంతోష్‌లాడ్, మధు బంగారప్ప, జమీర్ అహ్మద్, దినేశ్ గుండూరావు, ఆర్‌బీ తిమ్మాపుర, శివరాజ్ తంగడగి, రహీంఖాన్, బైరతి సురేశ్ మాట్లాడుతూ అణగారిన వర్గాలపై సమాజంలో దాడులకు కారకులైనవారిని ఎక్కడికక్కడ ఎదుర్కోవాల్సి ఉందని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.



హెచ్‌డీ దేవెగౌడ



ప్రజ్వల్ రేవణ్ణ

హాసన్ నుంచి మీరే... పోటీ చేయాలి

- మాజీ ప్రధాని దేవెగౌడపై పెరుగుతున్న ఒత్తిడి
- ప్రజ్వల్‌కు మళ్లీ టికెట్‌పై భిన్నాభిప్రాయాలు

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ మధ్య పొత్తుపొడవడంతో మొత్తం 28 నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థులు బరిలోకి దిగబోతున్నారు. ఈ రెండు పార్టీల మధ్య ఇంతవరకు సీట్ల పంపిణీ ఖరారు కానప్పటికీ మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవెగౌడ హాసన్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ పేరును అధికారికంగా ప్రకటించడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బేలూరు, హాసన్, అరసికెరె అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తలతో సమావేశం జరిపిన దళపతి దేవెగౌడ, ప్రజ్వల్ పేరు విషయంలో స్పష్టత ఇచ్చారు. ఇందులో భాగంగా చెన్నరాయపట్టణ, ఆలూరు, సకలేశపుర శాసనసభ నియోజకవర్గాల కార్యకర్తలతో ఇటీవల ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మెజారిటీ సమావేశాలలో దేవెగౌడ ఈసారి హాసన్ నుంచి బరిలోకి దిగాలన్న ఆకాంక్ష వ్యక్తమైంది. దేవెగౌడకు అనుకూలంగా కార్యకర్తలు పలుసమావేశాల్లో నినాదాలు చేశారు. సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ పేరును ఉమ్మడి అభ్యర్థిగా ఆయన ప్రకటించడాన్ని స్థానిక బీజేపీ నేతలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రజ్వల్‌పై నియోజకవర్గంలో కొంత వ్యతిరేకత ఉందని, పైగా బీజేపీ నేతలు ఏటీ రామస్వామి, దేవరాజేగౌడ తదితరులు ప్రజ్వల్ రేవణ్ణ అభ్యర్థిత్వంపై బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు జేడీఎస్‌లోని ఒక వర్గం దళపతి దేవెగౌడ దృష్టికి తీసుకెళ్లింది. బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఉన్న హాసన్ నేత ప్రీతంగౌడ మాత్రం ఒకింత తటస్థంగా ఉండడం కుతూహలం రేకెత్తిస్తోంది. హాసన్ టికెట్‌ను జేడీఎస్‌కు కేటాయించినప్పటికీ బీజేపీ నేతల మద్దతును పూర్తిస్థాయిలో సమీకరించుకోవాలంటే స్థానిక నేతల సహకారం అవసరమని రాజకీయ పరిశీలకులు సైతం భావిస్తున్నారు. హాసన్ నియోజక వర్గానికి సంబంధించినంతవరకు స్థానిక బీజేపీ నేతలంతా ప్రజ్వల్ స్థానంలో దేవెగౌడ అభ్యర్థిగా ఉండాలని దాదాపు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు. ప్రజ్వలపై పలు ఆరోపణలు ఉండడం, మరోవైపు ఎన్నికల అక్రమాలకు సంబంధించి అనర్హత కేసు పెండింగ్‌లో ఉండడం వంటి అంశాలను బీజేపీ నేతలు తమ అధిష్ఠానం పెద్దల వద్ద ప్రస్తావిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రజ్వల్ రేవణ్ణపై హైకోర్టు అనర్హత వేటు వేయగా సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతిమ తీర్పు రాకముందే ప్రజ్వల్ పేరు ప్రతిపాదించడాన్ని జేడీఎస్‌లోని పలువురునేతలు అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ఒకవేళ సుప్రీంకోర్టు సహా తన తుది తీర్పులో హైకోర్టు తీర్పును సమర్థిస్తే జేడీఎస్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై అనర్హత వేటు పడి ఆరేళ్లపాటు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కూడా ఉండదని స్థానిక జేడీఎస్ నేతలు అంటున్నారు. ఈ అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుని సిట్టింగ్ జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బదులుగా దేవెగౌడను పోటీ చేయాలని ఇటు జేడీఎస్‌లోనూ, అటు బీజేపీలోనూ పెద్ద ఎత్తున ఒత్తిడి నెలకొని ఉన్నట్టు తెలుస్తోంది. ప్రజ్వల్ రేవణ్ణకు టికెట్ నిరాకరిస్తే తన కుమారుడు, మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ, ఆయన సతీమణి భవాని రేవణ్ణ ఎదురు తిరిగే ప్రమాదం ఉందని దేవెగౌడ ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. స్థానిక బీజేపీ నేతలను ఒప్పించి, తమ పార్టీ నేతలను బుజ్జగించి మరో అవకాశాన్ని మనవడు ప్రజ్వల్‌కే ఇవ్వాలని దేవెగౌడ కృతనిశ్చయంతో ఉన్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సుప్రీంకోర్టు తుది తీర్పు ఒక వేళ ప్రజ్వల్ రేవణ్ణకు వ్యతిరేకంగా వస్తే మాత్రం హాసన్ సీన్ మారిపోతుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.




లాల్‌బాగ్ గ్లాస్‌హౌస్‌లో అనుభవమండపం

ఫ్లవర్‌షోకు పోటెత్తిన జనం

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లాల్‌బాగ్ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన ఫ్లవర్ షోకు చివరి రోజు ఆదివారం జనం పోటెత్తారు. పది రోజులక్రితం ఫ్లవర్ షోను ప్రారంభించారు. వారాంతంతోపాటు వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో కుటుంబ సభ్యులతో కలసి పెద్ద ఎత్తున ప్రజలు ప్రదర్శనను తిలకించారు. 34 అడుగుల ఎత్తుతో అనుభవమండపం, బసవణ్ణ రూపాలను పుష్పాలతో అలంకరించారు.

గాలి, ఆయనూరు సహా అందరూ తిరిగి వస్తారు

- మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప



బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో కొనసాగి వివిధ కారణాలతో దూరమైన నాయకులంతా తిరిగి పార్టీలోకి వస్తారని, మరింతమంది కొత్తవారి చేరికలు ఉంటాయని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప పేర్కొన్నారు. మత్తూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆయనూరు మంజునాథ్ కూడా పార్టీలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. జేడీఎస్‌తో పొత్తుకు సంబంధించి అన్ని ప్రక్రియలు ముగిశాయని, సీట్ల పంపిణీ అధిష్ఠానానికి సంబంధించిన విషయమన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. తాను రాష్ట్రమంతటా పర్యటిస్తానని అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రపై రాష్ట్రమంతటా ఉత్సాహంగా ఉన్నారని, అదే మరింత బలం కానుందన్నారు. మత్తూరులో జరుగుతున్న యాగంలో పాల్గొంటున్నానని, ఇక్కడ నిరంతరం యజ్ఞాలు, హోమాలు జరుగుతుంటాయని వివరించారు. 'ఇండియా' కూటమికి బీటలు పడ్డాయని అన్నారు. సమష్టిగా నరేంద్రమోదీని ఎదుర్కోవాలనే వారి ప్రయత్నం ఆరంభంలోనే బెడిసికొట్టిందన్నారు. మోదీకి వ్యతిరేకులే ఉండకూడదని, అప్పుడు దేశం మరింత ప్రగతి సాధిస్తుందన్నారు. కాగా మండ్య టికెట్ విషయం ఇంకా ఖరారు కాలేదన్నారు. ఎంపీ సుమలత బీజేపీలో చేరే విషయం చర్చకు వచ్చిందన్నారు.

కమలంతో కలిసేందుకు సిద్ధం

- గాలి జనార్దనరెడ్డి వెల్లడి



బళ్లారి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీతో కలిసిపని చేసేందుకైనా, పార్టీలో తిరిగి చేరేందుకైనా తాను సిద్ధంగా ఉన్నానని కర్ణాటక రాష్ట్ర ప్రగతి పార్టీ అధ్యక్షుడు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ బీజేపీతో కలిసి పని చేసేందుకు చర్చలు జరిపిందని అన్నారు. ఒక వేళ బీజేపీతో కలవకపోయిన ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. కొప్పళ జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీలో చేరేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. జగదీశ్ శెట్టర్ కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి తిరిగి వెళ్లిన నేపథ్యంలో మీరు కూడా పార్టీలో చేరతారా అని విలేకరులు ప్రశ్నించగా ఈ విధంగా సమాధానం చెప్పారు.

హనుమంతుడి జెండా తొలగింపు

- మండ్య జిల్లా కెరెగూడులో ఉద్రిక్తత
- గ్రామస్థుల ఆగ్రహం.. పోలీసుల లాఠీ చార్జ్

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లా కెరెగూడు గ్రామంలో హనుమంతుడి జెండా తొలగింపు అంశం వివాదానికి దారితీసింది. జెండాను తొలగించిన అధికారులపై గ్రామస్థులు విరుచుకుపడ్డంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి అదుపులోకి తెచ్చారు. అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన సందర్భంగా కెరెగూడు గ్రామం రంగమందిరం వద్ద ఈనెల 19న 108 అడుగుల ఎత్తుతో స్తంభాన్ని ఏర్పాటు చేసి హనుమంతుడు, శ్రీరాముడు ఫొటోలు కల్గిన జెండాను గ్రామస్థులంతా కలసి ఆవిష్కరించారు. గ్రామ పంచాయతీ ఈఓ వీణా సూచన మేరకు అధికారులు కార్యాచరణకు సన్నద్ధం కావడంతో శనివారం రాత్రి నుంచే అక్కడ ప్రజలు గుమిగూడారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా స్తంభాన్ని ఏర్పాటు చేసి జెండాను ఎగురవేశారని ఆదివారం ఉదయం జిల్లా యంత్రాంగం పోలీసులతోపాటు గ్రామానికి చేరుకుని తొలగింపు చర్యలకు సిద్ధమయ్యారు. ఇదే సందర్భంలో అధికారులు, గ్రామస్థుల మధ్య వాగ్వాదానికి చోటుచేసుకుంది. అధికారులను ఉద్దేశించి 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. పోలీసుల తీరుపై మహిళలు మండిపడ్డారు. కొందరు మహిళలు ఇదే స్తంభం వద్ద ఉరి వేసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు లాఠీచార్జ్ చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తతకు దారితీసింది. తర్వాత పోలీసులు జెండాను తొలగించారు. ఎమ్మెల్యే గణిగ రవికి వ్యతిరేకంగా గ్రామస్థులు నినాదాలు చేశారు. మండ్య - యడియూరు జాతీయ రహదారిపై గ్రామస్థులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండ్య, మైసూరు ప్రాంతాలకు చెందిన హిందూ సంఘాల ముఖ్యులు అక్కడికి చేరుకున్నారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలు చేశారు. మంత్రి చలువరాయస్వామి మాట్లాడుతూ జాతీయ పతాకం ఎగురవేసేందుకు గౌరిశంకర్ సేవా ట్రస్టు అనుమతులు తీసుకుందన్నారు. కానీ హనుమంతుడి జెండాను ఎగురవేశారన్నారు. జెండా ఆవిష్కరణలో రాజకీయం కొనసాగుతోందని మండిపడ్డారు. ఒకచోట అవకాశమిస్తే ప్రతి ప్రాంతంలోనూ ఇదే వివాదం కొనసాగుతుందన్నారు. జిల్లా ఎస్పీ యతీశ్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో భద్రత కోసం 12 కేఎస్‌ఆర్‌పీ ప్లటూన్లను కేటాయించారు. కెరెగూడు గ్రామంలో హనుమంతుడి జెండా తొలగింపు వివాదం నేపథ్యంలో ప్రతిపక్షనేత ఆర్. అశోక్, ముఖ్యనాయకులు గ్రామాన్ని సందర్శించేందుకు తరలారు. చిత్రదుర్గలో సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ మండ్యలో జాతీయ జెండాకు అనుమతులు పొంది కాషాయం జెండా ఎగురవేయడం సరికాదన్నారు. జాతీయ పతాకాన్ని తొలుత ఆవిష్కరించాలని, ఆ తర్వాత ఏ జెండానైనా ఎగురవేసుకోవచ్చునన్నారు.



108 అడుగుల స్తంభం ఇదే...




పెద్దసంఖ్యలో గుమిగూడిన గ్రామస్థులు

పీజీలకు కొత్త మార్గదర్శకాలు

- బీబీఎంపీ అనుమతి తప్పనిసరి
- గుర్తింపు కార్డులు సమర్పించాలి



బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో పేయింగ్ గెస్ట్ (పీజీ)లకు కొత్త మార్గదర్శకాలను నగర పోలీస్ కమిషనరేట్ జారీ చేసింది. నిబంధనలు అన్ని పీజీలు పాటించాల్సిందేనని, ఉల్లంఘిస్తే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించింది. రాష్ట్ర రాజధాని బెంగళూరులో ఇకపై పేయింగ్ గెస్ట్‌లు ప్రారంభించాలంటే బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. పీజీలలో ఉండేవారి గుర్తింపు కార్డులు సమర్పించాలి. తాజా ఫొటోతోపాటు బంధువుల వివరాలు, మొబైల్ నెంబర్లు నమోదు చేసుకోవాలి. పీజీలలో ఉండేవారిని సంప్రదించేందుకు వచ్చే బంధుమిత్రులు ఎవరైనా వారి వివరాలను ప్రత్యేకంగా రిజిస్టర్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. సీసీటీవీలు, అగ్నిమాపకశాఖకు వీలుండే లాంటి సౌలభ్యాలు ఉండాలి. డ్రగ్స్ వాడకంతోపాటు ఇతరత్రా అసాంఘిక కార్యకలాలపాలకు పాల్పడేవారికి పీజీలలో అవకాశం కల్పించరాదు. పీజీలలో వంట మనుషులు, సెక్యూరిటీ గార్డ్, పని మనుషుల వివరాలు కూడా తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ విదేశీయులకు పీజీలో అవకాశం కల్పిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. పీజీలలో నెలవారీ నివసించే వారికి మాత్రమే చేర్చుకోవాలి. తాత్కాలిక బస చేసేవారికి అవకాశం ఇవ్వరాదు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు ఎటువంటి లౌడ్ స్పీకర్లు వినియోగించరాదు. పోలీసుశాఖ కాలం 34డి, 70 నిబంధనలకు అనుగుణంగా అందరూ నిబంధనలు పాటించాల్సిందేనని ఆదేశాలలో పేర్కొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.55	1,617.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	354	8,422
సామర్థ్యం (టీఎంసీలు)	9.86	54.16

ఇకపై హంపీ దేవాలయంలో డ్రస్ కోడ్



ఆలయంలో డ్రస్ కోడ్ అమలు చేస్తున్న అధికారులు

బళ్లారి, జనవరి28(ఆంధ్రజ్యోతి): హంపీ విరుపాక్షేశ్వర స్వామిని దర్శించాలంటే ఇక నుంచి డ్రస్ కోడ్ పాటించాల్సిందే. పర్యాటక కేంద్రం అయిన హంపీకి విదేశీయులు ఎక్కువగా వస్తుంటారు. వీరు ఆలయంలోకి షార్ట్స్ లాంటి కురుచ దుస్తులు ధరించి వస్తుంటారు. ముఖ్యంగా ఇంత కాలం జీన్సులు, షార్ట్సులతో వచ్చి ఇతర భక్తులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా దేవాలయంలో భక్తివాతావరణం తగ్గించే వారి చర్యలకు విరుగుడుగా ఈ డ్రస్ కోడ్ అమలులోకి తెచ్చినట్టు విజయనగర కలెక్టర్ తెలిపారు. ఇకపై దేవాలయంలో ప్రవేశించాలంటే పురుషులైతే తెల్లటి లుంగీ ధరించాలి. మహిళలు చీర లాంటి పూర్తి దుస్తులు ధరించాల్సి ఉంటుంది. ఇకపై హిందూదేవాలయ సంప్రదాయం ప్రకారం నియమ నిబంధనలు పాటిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణా ఎడ్లబండ్ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎడ్లబండ్లు

సిరుగుప్ప, జనవరి 28: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఎడ్లబండ్లను పోలీసులు పట్టుకుని వారిపై కేసు దాఖలు చేశారు. సిరుగుప్ప తాలుకాలోని హగరి నది, భాగవడే కాలువ, తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఎడ్లబండ్లతో ఇసుక రవాణా జరుగుతోంది. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై మైనింగ్ అధికారులు గతంలో చాలాసార్లు కేసులు దాఖలు చేసినా ఇసుక రవాణా యథావిధిగా కొనసాగించడంతో పోలీసులు ఎడ్లబండ్లను పట్టుకుని కేసు దాఖలు చేశారు.

బీజేపీ చలో అభియాన్

బళ్లారిరూరల్, జనవరి 28 : బళ్లారి నగరంలో వాజ్‌పేయి లేఔట్ సంగనకల్లు రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ నేతృత్వంలో ఛలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర విధానపరిషత్ ప్రతిపక్ష నేత శ్రీనివాస పూజారి హాజరై పార్టీ బలోపేతంపై పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని పలువురికి కొన్ని బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో గోనాళ్ మురహరి గౌడ, గుర్లింగన గౌడ, రాజశేఖర్‌గౌడ్, సిరుగుప్ప మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, గుత్తిగనూరు విరుపాక్షిగౌడ, సీనియర్ బీజేపీ నాయకులు రామలింగప్ప, శివ, శివకృష్ణ, తిమ్మారెడ్డి, వీరశేఖరరెడ్డి, ప్రకాష్ గౌడ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల వినియోగానికి రెండు బావులు

హోసూరు జనవరి 28: హోసూరు తేరుపేట ప్రాంతంలో కొండపైఉన్న ప్రసిద్ధి చెందిన మరగతాంబికై, చంద్రచూడేశ్వర ఆలయంలో ప్రతి సంవత్సరం మార్చి నెలలో రథోత్సవాలు ఘనంగా జరుగుతాయి. చాలామందికి ఇంటి దేవునిగా స్వామి వారు కొలువైఉన్న ఉన్నారు. ఇక్కడ ఉన్న పుష్కరిణి (కోనేరు) పచ్చకుళం అని పేరుతో పిలువబడుతుంది. తేరుపేటలో ఉన్న ఈ కోనేరులో భక్తులు తమ మొక్కులను తీర్చుకుంటూ ఉప్పు, మిరియాలు వేస్తూ ఉంటారు. దీంతో ఈ నీరు తాగేందుకు సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో భక్తుల దాహార్తి తీర్చేందుకు రెండు కొత్తబావులు ఏర్పాటు చేశారు. పుష్కరిణికి సమీపాన రెండు బావులకు రిటైర్డ్ గ్రామ పరిపాలన అధికారి బాలకృష్ణన్ పూజలు చేసి అందుబాటులోకి తెచ్చారు.

గట్టుపైన బస్సు... పొలాల్లో టైర్

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

బళ్లారి గాంధీనగర్, జనవరి 28: ప్రయాణికులతో వెళుతున్న కేఎస్‌ఆర్టీసి బస్సు ప్రమాద వశాత్తు ముందు టైర్ యాక్సిల్ కట్ కావడంతో...బస్సు ఎడమ టైర్.. పొలాల్లో పరుగులు దీసింది. విషయాన్ని గ్రహించి బస్సు డ్రైవర్ అప్రమత్తతతో ఉన్నఫళంగా బస్సువేగాన్ని తగ్గించి... ప్రమాదం జరగకుండా కాపాడిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం గదగ్ జిల్లా పరిధిలోని మాగడి ప్రాంతంలో చోటు చేసుకుంది. సాధారణంగా బస్సు వెళుతున్న సమయంలో టైర్ పక్చర్ కావడం, లేదా బరెస్ట్ కావడం జరిగి బస్సు అదుపు తప్పి బోల్తాపడడం చూస్తుంటాం. అయితే గదగ్ జిల్లా పరిధిలోని లక్ష్మేశ్వర నుండి మాగడి మార్గం మీదుగా శిరహట్టికి బయలుదేరిన కేఎస్ఆర్టీసి బస్సు ముందు చక్రం యాక్సిల్ కట్ కావడంతో ఎడమ టైరు బయటకు వచ్చి... ఏకంగా ప్రక్కనే ఉన్న పొల్లాలోకి పరుగులు దీసింది. ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ చాకచక్యంతో బస్సును అదుపు చేసి ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపాడారు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.





ప్రమాదానికి గురైన ఆర్టీసి బస్సు, పొలాల్లోకి పరుగులు దీసిన బస్సు టైర్

అడుగంటిన తుంగభద్రమ్మ

● నీరులేక ఎండిపోతున్న వరి పంట ● తల్లడిల్లుతున్న రైతులు

కంప్లి, జనవరి 28 : జీవనది అయిన తుంగభద్రలో ఈ యేడాది జనవరి నెలలోనే పూర్తిగా నీరు అడుగంటిపోయింది. ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఇలా ఎండిపోయిందని ఇటు ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ యేడాది జనవరిలోనే ఎండలు ప్రారంభం కావడంతో కాస్తో కూస్తో వస్తున్న నీరు కూడా ఆవిరైపోయింది. ప్రస్తుతం కంప్లి పరిధిలోని సన్నాపురం, ఇటిగి, మన్నూరు, సూగూరు, గ్రామాల రైతన్నలు తుంగభద్ర నది ఒడ్డున భూముల్లో వరినాట్లు వేసుకున్నారు. నదిలో నీటికి మోటర్లను అమర్చి పంటకు నీరు పారిస్తారు. కానీ నదిలో పూర్తిగా నీరు ఎండిపోవడంతో ఆ నీటిని నమ్ముకుని పంటలు వేసుకున్న రైతులకు మాత్రం పూర్తిగా కష్టాలు ఎదురయ్యాయి. కానీ బోర్ల కింద వున్న రైతులు మాత్రం కాస్తో కూస్తో నీటిని అందించగలుగుతున్నారు. దీంతో రబీలో కూడా తమకు కష్టాలే మిగిలాయని రైతులు వాపోతున్నారు. ఈ సందర్భంగా రైతులు అచ్యుత్ వర్మ, నారాయణస్వామి, రఘురామ్‌లు మాట్లాడుతూ ప్రతి యేడాది ఫిబ్రవరి, మార్చి నెల వరకు నీరు నదిలో వుండేదని, ఈ యేడాది ఎండలు ప్రారంభం కాకముందే నదిలో పూర్తిగా నీరు ఎండిపోయిందన్నారు. దీంతో వన్యప్రాణులు కూడా ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇటిగి ప్రాంతంలో రైతన్నలు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. గతంలో మన్నూరు సూగూరు-ఉళియనూరు మధ్య నదిని దాటడానికి తెప్పలను ఉపయోగించేవారు. ప్రస్తుతం నదిలో నీరు లేకపోవడంతో తెప్పలను ఒడ్డుకు చేర్చారు.



నీరు లేక ఖాళీగా వున్న మోటార్లు



ఎండిపోయి బీటలు పారిన వరిపొలం

‘విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి’

బళ్లారి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అప్పుడే మానసిక ఒత్తిడులను జయించి సమాజంలో ఎదురయ్యే ఎటువంటి సమస్యలైనా ఎదుర్కొంటారని బళ్లారి జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్ చెప్పారు. బళ్లారి జిల్లా క్రీడా మైదానంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 120 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ, రామస్వామి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని అప్పుడే ఆరోగ్యకర జీవితంతో ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులను ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తుందన్నారు. అండర్ 14, అండ్ 16 లో విజేతలు అయిన వారికి వచ్చే నెల గుజరాత్‌లో జరిగే అల్ఇండియా క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అనంతరం రన్నింగ్, లాంగ్ జంప్ ఈవెంట్లలో రాణించిన క్రీడాకారులకు సర్టిఫికేట్‌లతో పాటు మెమెంటోలను ప్రదానం చేశారు.



1600 మీటర్ల పరుగు పందెంలో అండర్ 14 విద్యార్థినులు

పిల్లలకు మొబైల్ కంటే పుస్తకాలే బెటర్

ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, జనవరి 28: తల్లిదండ్రులు తమ ఇళ్లల్లో పిల్లలకు మొబైల్‌కు బదులుగా పుస్తకాలు ఇచ్చి జ్ఞానాన్ని పెంపొందించుకునేలా వారికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే జేఎన్‌గణేష్ తెలిపారు. కంప్లిలో ఆదివారం జరిగిన విద్యాసాగర్ పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు టీవీలు, మొబైల్ ఫోన్‌లు, ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌ల మోజులో పడి పుస్తకాలను చదవడమే కనుమరుగైందన్నారు. వీటివల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో న్యూస్‌పేపర్లు చదవడంపై కూడా పిల్లలు ఆసక్తి పెంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తమవంతుగా నియోజకవర్గంలో విద్యార్థుల శిక్షణకు ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చామన్నారు. నూతన పాఠశాలలో విద్యార్థులకు బస్సుసౌకర్యం కల్పించామని తెలిపారు.

అనంతరం విద్యాసాగర్ పాఠశాల వ్యవస్థాపకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ కంప్లి పట్టణంలో 2003లో పాఠశాలను ప్రారంభించామని, అప్పటి నుంచి ఇప్పటివరకు పిల్లలకు ఉత్తమ శిక్షణ ఇవ్వడం వల్లనే తమ పాఠశాలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఇక ముందు కాలంలో కూడా విద్యార్థులకు మరింతగా మంచి చదువులు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలకు, జానపద గీతాలకు నృత్యాలు చేసి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు తహసీల్దార్ శివరాజ్ శివపుర, తాలుకా శిక్షణ అధికారి సిద్దలింగమూర్తి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, హేమావతి పూర్ణచంద్ర, బట్టప్రసాద్, కిషోర్, కొట్రేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

బూడిదకొండ వద్ద పారిశుధ్య చర్యలు



బూడిదకొండ వద్ద పారిశుధ్య చర్యలు చేపడుతున్న రక్షణ వేదిక పదాధికారులు

కంప్లి, జనవరి 28: కుడితిని కేపీటీసీఎల్, తోరణగల్లు గ్రామాల మధ్య ఎన్‌హెచ్ 63 పక్కన వుండే బూడిద కొండ వద్ద రక్షణ వేదిక పదాధికారులు ఆదివారం స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జంగ్లిసాబ్, సంపత్, మాట్లాడుతూ ఈ ప్రాంతం పర్యాటకులు సందర్శించే ప్రదేశం కావున ఈ ప్రాంతాన్ని అధికారులు సుందరంగా తీర్చిదిద్దాలన్నారు.. అక్కడ తాగేనీరు, శౌచాలయాలు, విద్యుత్ కాంతి లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సుందరంగా బృందావనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కుడితిని, తోరణగల్లు కర్ణాటక రక్షణ వేదిక పదాధికారులు పాల్గొన్నారు.

తెలుగు అసోసియేషన్ క్యాలెండర్ విడుదల



క్యాలెండర్లను విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

హొసపేట,జనవరి 28: తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హొసపేటలో తెలుగు క్యాలెండర్‌ను విడుదల చేశారు. హొసపేటలో 2002 సంవత్సరంలో మాజీ మంత్రి కృష్ణదేవరాయలు, అప్పటి తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఏర్పాటు చేసిన ఈ తెలుగు సంఘం నాటినుంచి నేటి వరకు తమ ఉనికి చాటుకుంటూ పలు కార్యక్రమాలను జరుపుకుంటోంది. అందులో భాగంగా తమ మాతృభూమి, భాషాసంస్కృతులను పరిచయం చేస్తూ ప్రతి సంవత్సరం తెలుగు క్యాలెండర్‌ను విడుదల చేస్తూ వస్తోంది. సంఘం అధ్యక్షులు వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వి.రావు సంయుక్త కార్యదర్శి రాధాకృష్ణ, సత్యనారాయణ కార్యవర్గ సభ్యులు జయరాం, ప్రభాకర్, బాలరనసింహులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ అధ్యక్షుడిగా కంప్లి ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కంప్లి, జనవరి 28 : కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే జేఎన్ గణేష్‌ను ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం చేనేత నిగమ అధ్యక్షుడిగా నియమించడంతో ఆయనను ఆదివారం కంప్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, బట్ట ప్రసాద్, సుధీర్, మస్తాన్‌లు ఎమ్మెల్యేను అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ యువ నాయకుడు గణేష్‌కు చేనేత నిగమ అధ్యక్షుడిగా స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం తనపై నమ్మకం వుంచి చేనేత నిగమ అధ్యక్షులుగా నియమించిందన్నారు. రాష్ట్రంలో తన వంతుగా చేనేతను నమ్ముకుని నివసిస్తున్న వారిని గుర్తించి వారికి నిధులు, పథకాలు అందేలా చూస్తానని, వారికి తమ ప్రభుత్వ సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు.

బళ్లారిరూరల్: కర్ణాటక రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ అధ్యక్షుడిగా ఎంపికయిన ఎమ్మెల్యే గణేష్‌ను ఆయన స్వగృహంలో బళ్లారి సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ బోయపాటి విష్ణువర్ధన్ పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఏర్పాటు చేయాలని వినతి

రాయచూరు జనవరి 28: ఏళ్ల తరబడిగా ఈ ప్రాంత ప్రజలు కోరుకున్న విధంగా రాయచూరు జిల్లాలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు రవి భోసరాజు కోరారు. ఆదివారం బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం సుదీర్ఘ కాలంగా రాయచూరు జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న నిరవధిక దీక్షను ఈ సందర్భంగా సీఎం దృష్టికి తెచ్చారు. రాయచూరు జిల్లా కేంద్రం గుర్తించిన ప్రత్యేక అవసరాలు ఉన్న జిల్లాల జాబితాలో ఉండడంతో పాటు 371(జే) ద్వార ప్రత్యేక ప్రతిపత్తిని కలిగి ఉన్నట్లు వివరించారు. ఎయిమ్స్ ఏర్పాటు చేయడం ద్వార ఈ ప్రాంత ప్రజలకు చిరకాల వాంచను నెరవేర్చాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్టే బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి రాష్ట్రానికి ఎయిమ్స్ అందేలా కృషి చేయాలని ఎయిమ్స్‌ను రాయచూరు జిల్లాలో ఏర్పాటు చేయాలని కోరినట్లు రవి భోసరాజు తెలిపారు.

హోసూరు జోన్

కబడ్డీలో క్రీడాకారుల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

హోసూరు, జనవరి 28: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గోల్డెన్ బ్రదర్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున ఈనెల 26, 27 తేదీలలో హోసూరు సమీపానగల పూనపల్లి గ్రామంలో జరిగిన కబడ్డీ టోర్నీల్లో చెన్నై, సేలం, కృష్ణగిరి, పాండిచ్చేరి, బెంగళూరుకు చెందిన 3 జట్లు పాల్గొన్నాయి. వివిధ రౌండ్లలో జరిగిన కబడ్డీ టోర్నీలో సేలం జిల్లాకు చెందిన తంబపట్టి జట్టు, సేలంకు చెందిన ఉదయ జట్టు ఫైనల్స్‌లో పాల్గొని గెలుపొందాయి. ఫైనల్స్‌లో తంబపట్టి జట్టు 22 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీని కైవశం చేసుకుంది. సేలం ఉదయ జట్టు 11 పాయింట్లతో ద్వితీయస్థానంలో నిలిచింది. ప్రథమబహుమతికి ట్రోఫీతోపాటు రూ.50వేల నగదు బహుమతి అందజేయగా, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో గోల్డెన్ బ్రదర్స్ క్లబ్ మల్లికార్జునన్, డీఎంకే కళా సాహిత్య వివేచన మండలి అధ్యక్షత మంజునాథప్ప, పూనపల్లి పంచాయతీ అధ్యక్షురాలు సావిత్రమ్మ బైరప్ప, పంచాయతీ ఉపాధ్యక్షురాలు నేత్రావతి పాల్గొన్నారు. తొలుత మాజీ ఎమ్మెల్యే వెంకటస్వామి చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్యలు పుష్పాంజలి ఘటించారు.

ధర తగ్గిన కొత్తిమీర పొలాల్లోనే వదిలేసిన రైతులు

హోసూరు (సిప్‌కాట్) జనవరి 28: హోసూరు ప్రాంతంల్లో పూలు, కూరగాయలు, పంటలకు ఎంత ప్రాధాన్యత ఉంది. అలాగే పుదీనా, కొత్తిమీర, పాలకూర వంటి ఆకుకూరలను భారీగా సాగు చేస్తున్నారు. హోసూరు సమీపాన శూలగిరి మార్కెట్ నుంచి హోసూరు, బెంగళూరుకు తరలిస్తారు. ఇటీవల కొద్దిరోజులుగా కొత్తిమీరకు తగిన ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. కట్ట రూ.1, 2 రూపాయలకు మించి అడగడం లేదని విచారం వ్యక్తం చేశారు. దీంతో గిట్టుబాటు ధర లభించడం లేదని పంటను పొలాల్లోనే వదిలస్తున్నామన్నారు. ఎలువపల్లి గ్రామానికి చెందిన సిద్దప్ప తనకున్న ఎకరన్నర పొలంల్లో సుమారు రూ.60 వేల రూపాయల వరకు వస్తుందని అంచనా వేసి కొత్తిమీర సాగు చేశాడు. అయితే గిట్టుబాటు ధర లభించకపోవడంతో పంటను పశువులు మేపేందుకు వదిలేశాడు. కాగా కొంతమంది పశుగ్రాసంగా కొత్తిమీర కోసుకుంటున్నారన్నారు. ఇది సగటు రైతులకు నష్టమన్నారు.



పొలంలో కొత్తమీర మేస్తున్న ఆవు

ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

రాయచూరు జనవరి 28: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో డొంకుతిరుగుడు దారులను వెతుక్కుంటున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందని బీజేపీ రాష్ట్రధ్యక్షుడు బీవై విజయేంద్ర అన్నారు. పార్టీ కార్యాక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ఆయన ఆదివారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శక్తికి మించిన హామిలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ నాయకులు హామిల అమలులో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. హామిల అమలుపై రోజు పత్రిక ప్రకటనలు బహిరంగ సభలో ఉపన్యాసాలు చేస్తున్న మంత్రులు వాటి అమలు తీరుపై దృష్టి సారించడం లేదన్నారు. వచ్చే లోకసభ ఎన్నికలను కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం తప్పదని ఆయన జోస్యం చెప్పారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

గడ్డివాములు అగ్నికి ఆహుతి



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయచూరు, జనవరి 28: జిల్లాలోని సిరవార పట్టణ సమీపంలో ఆదివారం ఆకస్మికంగా నిప్పంటుకుని గడ్డివాములు దగ్ధమయ్యాయి. సిరవార పట్టణ సమీపంలోని ఫెండ్స్ ఢాబా వెనకభాగంలో రైతులు మౌనేష్, కరియప్ప, భీమప్ప, హనుమంత, శివరాజ్, సిద్దప్ప తదితరులు తమ పశువుల కోసం మేతను పోగు చేసి వాములుగా భద్రపరుచుకున్నారు. వర్షాభావ పరిస్థితి వల్ల ఇప్పటికి పశుగ్రాసం కొరతను ఎదుర్కొంటున్న రైతులు భవిష్యత్తు అవసరం కోసం దాచి పెట్టుకున్న గడ్డివాములు ఒక్కసారిగా అగ్నికి ఆహుతి కావడంతో తీవ్ర విచారానికి గుయ్యారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికొచ్చి మంటలార్పే ప్రయత్నం చేసేలోగానే పూర్తిగా వాములు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో దాదాపు 15కు పైగా ట్రాక్టర్‌ల గడ్డి కాలిపోయినట్లు రైతులు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

బాలాంత్రపు రజనీకాంతరావు (జయంతి)



బహుముఖ ప్రజ్ఞాశాలి బాలాంత్రపు రజనీకాంతరావు 1920 జనవరి 29న కృష్ణా జిల్లా నిడదవోలులో జన్మించారు. జంట కవులైన వేంకట పార్వతీశ కవుల్లో ఒకరైన బాలాంత్రపు వెంకటరావు వీరి తండ్రి. గాయకుడు, వాగ్గేయకారుడు, రచయిత, స్వరకర్త, తొలితరం సంగీత దర్శకుల్లో ఒకరైన రజనీకాంతరావు రేడియో శ్రోతలకు సుపరిచితులు. లలిత సంగీత వికాసానికి ఎనలేని కృషితో 'ఆకాశవాణి'ని జనరంజకం చేశారు. పిల్లలకోసం జేజిమామయ్య పాటలు రచించారు. రేడియో కోసం వందలాది గీతాలను రచించడమే కాక ఇతర రచయితల గీతాలకు కూడా స్వరకల్పన చేశారు. కళాప్రపూర్ణ, కళారత్న, ఠాగూర్ అకాడమీ రత్న, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. 2018 ఏప్రిల్ 22న కన్నుమూశారు.

వేటూరి సుందరరామమూర్తి (జయంతి)



తెలుగు సినీ రచయిత వేటూరి సుందర రామమూర్తి 1936 జనవరి 29న కృష్ణా జిల్లా మోపి దేవి మండలం పెదకళ్ళేపల్లిలో జన్మించారు. తొలినాళ్లలో పాత్రికేయుడిగా పనిచేశారు. కే విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 'ఓ సీత కథ' ద్వారా సినీ రంగ ప్రవేశం చేశారు. సంప్రదాయ కవిత్వం నుంచి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. పండితుల నుంచి పామరుల వరకు అందరినీ అలరించిన విశిష్టశైలి ఆయన సొంతం. మహాకవి శ్రీశ్రీ తర్వాత తెలుగు సినిమా పాటకి జాతీయఖ్యాతిని ఆర్జించి పెట్టింది ఆయనే. 8 నంది అవార్డులు సహా మొత్తం 14 అవార్డులు, ఒక జాతీయ పురస్కారం అందుకున్నారు. 2010 మే 22న కన్నుమూశారు.

గౌరి లంకేశ్ (జయంతి)



సామాజిక ఉద్యమకారిణిగా పేరొందిన గౌరి లంకేశ్ 1962 జనవరి 29న బెంగళూరులో జన్మించారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' బెంగళూరు ద్వారా పాత్రికేయ వృత్తిని ప్రారంభించారు. అనంతరం తండ్రి లంకేశ్ ప్రారంభించిన కన్నడ వారపత్రిక 'లంకేశ్'కు సంపాదకులుగా వ్యవహరించారు. అనంతరం సొంత పత్రికను నిర్వహించారు. ముక్కుసూటిగా వ్యవహరించే ధైర్యశాలి అయిన ఆమె నక్సలైట్ సానుభూతి పరురాలిగా గుర్తింపు పొందారు. 2017 సెప్టెంబరు 5న మృతి చెందారు.

ఓల్గా టోకార్జక్ (పుట్టినరోజు)



ప్రముఖ మేధావి, రచయిత్రి ఓల్గా నవోజా టోకార్జక్ 1962 జనవరి 29న జన్మించారు. పోలెండ్ దేశంలో ప్రజలను అమితంగా ప్రభావిత పరిచిన ఆమె సాహిత్యంలో 2018లో నోబెల్ పురస్కారం అందుకున్నారు. 'ఫ్లైట్స్' నవలకు గాను 'మాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్' గెలుపొందారు. రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్‌లో సభ్యురాలు. ఆమె రచనలు ప్రపంచవ్యాప్తంగా 40 భాషల్లోకి అనువదించబడడం విశేషం. గౌరవ డాక్టరేట్ ఇతర గౌరవాలు అందుకున్నారు.

రాజ్యవర్ధన్‌సింగ్ రాథోర్ (పుట్టిన రోజు)



'పద్మశ్రీ' గ్రహీత కల్నల్ రాజ్యవర్ధన్ సింగ్ రాథోర్ 1970 జనవరి 29న రాజస్థాన్ రాష్ట్రం జైసల్మేర్‌లో జన్మించారు. 2004 ఏథెన్స్‌లో షూటింగ్‌లో ఒలింపిక్ పతకాన్ని గెలుపొందారు. ఆర్మీలో సేవలందించి పదవీ విరమణ పొందాక రాజ కీయాల్లోకి వచ్చారు. అర్జున అవార్డుతో పాటు ఖేల్‌రత్న అవార్డును పొందారు. డబుల్ ట్రాప్ షూటింగ్‌లో ఛాంపియన్. ఆర్మీలో గ్రెనేడియర్స్ రెజిమెంట్‌లో కమీషన్డ్ ఆఫీసర్‌గా పనిచేసి కల్నల్ హోదాలో రిటైర య్యారు. 2014లో కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రిగా, 2017 నుంచి 2019 వరకు కేంద్ర యువజన శాఖా మంత్రిగా పనిచేశారు.

కైనన్ చెనై (పుట్టిన రోజు)



ఇండియన్ షూటర్‌గా రాణించిన కైనన్ చెనై 1991 జనవరి 29న హైదరాబాద్‌లో జన్మించారు. ఆయన తండ్రి డేరియస్ చెనై కూడా మాజీ షూటింగ్ ఛాంపియన్‌గా పేరొందారు. కాగా కైనన్ 50వ జూనియర్ మెన్ ట్రాప్ షూటింగ్‌లోనూ, 51వ నేషనల్ షూటింగ్ ఛాంపియన్‌ను గెలుపొందారు. 2008లో జరిగిన కామన్‌వెల్త్ యువ క్రీడల్లో బంగారు పతకం సాధించారు. 2016లో ఢిల్లీలో ఆసియా ఒలింపిక్ షూటింగ్ క్వాలిఫై అయ్యారు.

సహకార సంఘానికి డైరెక్టర్ల ఎన్నిక



నూతన పదాధికారులు వీరే...

బంగారపేట, జనవరి 28: తాలూకాలోని బలమందె వ్యవసాయ సేవా సహకార సంఘానికి ఒకరు ఏక గ్రీవంగాను, 11మంది డైరెక్టర్‌లు ఎన్నికల ద్వారా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి బాలకృష్ణ ప్రకటించారు. శని వారం జరిగిన ఎన్నికల్లో 12 స్థానాలకు 57మంది నామి నేషన్ వేయగా 20మంది వాపసు పొందారు. 37మంది బరిలో నిలిచారు. గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు కేవీ రామప్ప కూడా ఓటమి చవి చూశాడు. ఇదే గ్రామానికి చెందిన మనోజిరావ్ ఆయన పై గెలుపొందారు. ఎన్నికలు ఆద్యంతం ఆసక్తిగా సాగిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా బందోబస్తు కల్పించారు. ఫలితాల అనంతరం విజేతలు మిఠాయిలు పంపిణీ చేసి విజయోత్సవం చేసుకున్నారు.

పార్టీ కోసం పని చేసినవారికి పదవులు

- ఇది హైకమాండ్ సూత్రం
- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్



ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పార్టీకోసం పనిచేసిన ఎమ్మెల్యేలు, కార్యకర్తలకు అధికారం లభించాలనే కారణంతోనే బోర్డులు, కార్పొరేషన్‌లకు రెండేళ్ల వ్యవధి సూత్రాన్ని అధిష్ఠానం నిర్ణయించిందని డీసీఎం డీకే శివకుమార్ చెప్పారు. ఆదివారం సదాశివనగర్‌లోని నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ పార్టీలో అందరికీ అవకాశాలు రావాలన్నారు. కేవలం కొందరికి మాత్రమే పదవులు అంటే ఇతరులకు అన్యాయం జరుగుతుందన్నారు. అందుకే బోర్డులు, కార్పొరేషన్ పదవులను రెండేళ్ల మాత్రమే గడువు ఉండేలా నిర్ణయించామన్నారు. అధిష్ఠానం సూత్రాన్ని మేం అమలులోకి తెచ్చామని, ఇక్కడ సీఎం సిద్ధరామయ్య గానీ నా ప్రమేయంగానీ లేదన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఎంతోమంది కార్యకర్తలు పనిచేశారన్నారు. వారందరికీ మా ప్రభుత్వం ఉందని చెప్పుకోవడం మాత్రమే కాదని హోదాలు ముఖ్యమేనన్నారు. గడిచిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ 224 చోట్ల గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారని, అప్పుడేం జరిగిందో లోక్‌సభ ఎన్నికల్లో 28 సీట్లు గెలవడం కూడా అంతే అంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ జాతీయస్థాయిలో 543 స్థానాలు గెలవనీ..... వద్దనేవారు ఎవరని ప్రశ్నించారు.

లాల్‌బాగ్ ఫ్లవర్‌షోలో అయోధ్య రామమందిర నమూనా

- చింతామణి కళాకారిణికి ప్రథమ బహుమతి



అరటి బోద, కొబ్బరి మట్టలతో నిర్మించిన అయోధ్య రామమందిర నమూనా

చింతామణి, జనవరి 28: 75వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని బెంగళూరు లాల్‌బాగ్ ఫ్లవర్‌లో భాగంగా ఉద్యానవన సమాచార కేంద్రంలో ఏర్పాటైన అరటి బోద, కొబ్బరి మట్టలతో రూపొందించిన అయోధ్య రామమందిర నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చింతామణి పట్టణంలోని వెంకటేశ్వర లే అవుట్ నివాసి కళాకారిణి రశ్మిహర్షకు ప్రథమ బహుమతి దక్కడంతో చింతామణి పట్టణానికి, చిక్కబళ్ళాపుర జిల్లాకు పేరు తెచ్చారు. ఈనెల 27న బెంగళూరు ఉద్యానవనాలశాఖ సభాంగణంలో ఏర్పాటైన కార్యక్రమంలో రశ్మిహర్షకు ప్రథమ బహుమతి పారితోషికం, ప్రశంసాపత్రం అందజేసి గౌరవించారు. ఈ సందర్భంగా చిక్కపేట ఎమ్మెల్యే బీ గరుడాచార్, ఉద్యానవనాలు, పట్టుశాఖ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్యామల, సినీ నటుడు అశోక్, దొడ్డణ్ణ, డాలి ధనంజయ్, ఉద్యానవనాలశాఖ డైరెక్టర్ డీఎస్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా బాల రాముడి స్మరణలో ఉండగా అరటి బోద, కొబ్బరిమట్టలతో అయోధ్య రామమందిర నమూనాను రూపొందించిన కళాకారిణికి సర్వత్రా అభినందనలు వ్యక్తం అవుతున్నాయి. 215వ ఫలపుష్ప ప్రదర్శనలో భాగంగా ఉద్యానవనాలశాఖ ఇకెబాన, వెజిటబుల్ కార్వింగ్, థాయ్ ఆర్ట్స్, జానూరు, రంగవల్లుల పోటీలు, పుష్పభారతి, బోన్సాయ్, ఎండిన పుష్పాల అమరిక తదితర విభాగాలలో పోటీలు నిర్వహించగా వందలాదిమంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. కాగా అయోధ్య రామమందిర నమూనాను లాల్‌బాగ్ గ్లాస్ హౌస్‌లోనూ సందర్శనకు వీలు కల్పించారు.



కళాకారిణి రశ్మిహర్షకు బహుమతి ప్రదానం

ఆర్ట్స్ మేళాలను అన్నివర్గాలు ప్రోత్సహించాలి

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ మేళాలను అన్నివర్గాల ప్రజలు ప్రోత్సహించాలని డిజిటల్ క్రియేటర్ శ్వేతా కస్తవార్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రకళాపరిషత్‌లో బెంగళూరు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ మేళాను శుక్రవారం శ్వేతా లాంఛనంగా ఆరంభించారు. ఇదే సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో భిన్నమైన సంస్కృతి, భాషలు ఉన్నట్లుగానే వివిధ ఫ్యాషన్‌లు, చేతివృత్తులకు ప్రసిద్ధి అన్నారు. అన్నిరాష్ట్రాలకు చెందిన హస్తకళలు, చేతి వృత్తుల దారులు రూపొందించిన వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా భావితరాలలోను వృత్తికారుల మనుగడ కాపాడాలన్నారు. ఫిబ్రవరి 4వరకూ మేళా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



మేళాలో డిజిటల్ క్రియేటర్ శ్వేతాకస్తవార్

గ్రామీణులకు వైద్యసేవల కోసమే ట్రస్టు ఆసుపత్రి

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే బీఎంఎస్ ట్రస్టు ఆసుపత్రిని ఆరంభించామని డాక్టర్ బీఎస్ రాగిణి అభిప్రాయపడ్డారు. బెంగళూరు శివారులోని తాతగుణి పోస్టు అగర గ్రామంలో బీఎంఎస్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండవ ఆసుపత్రిని శనివారం లాంఛనంగా ఆరంభించారు. 29పడకలతో ఆసుపత్రికి ఏర్పాటు చేశామని అనుభవమైన డాక్టర్‌లు ఉన్నారన్నారు. పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తామన్నారు. డాక్టర్ దయానంద్‌తో పాటు ట్రస్టు ఛైర్మన్ గౌతమ్ వి కలత్తూర్, అవిరాంశర్మ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి, కేతఃమాతృచాయ ట్రస్టు ప్రతినిధులు కృష్ణమూర్తి, కౌశిక్, డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న రాగిణి తదితరులు

విద్యార్థులకు బెడ్‌షీట్ల పంపిణీ



బెడ్‌షీట్లను అందజేస్తున్న ప్రముఖులు

శిడ్లఘట్ట, జనవరి 28: పట్టణంలోని ఆశాకిరణ అంధమక్కళ వసతి పాఠశాలలో హసిరే ఉసిరు ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు బెడ్‌షీట్‌లు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు బెట హలసూరు బెంగళూరు శ్రీనివాస్‌మూర్తి అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమంలో దాతలు లక్ష్మీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ సత్యనారాయణ పాల్గొని అందజేశారు. తాలూకా ప్రైవేట్ పాఠశాలల సమాఖ్య అధ్యక్షుడు విజ్ఞమ్ నాగరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. శిడ్లఘట్ట తాలూకా కదంబ సైన్య అధ్యక్షుడు కళాకారుడు సీఎన్ మునిరాజ్, మునిరాజు, నటుడు డాక్టర్ వీ వెంకటేశ్‌లను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు కూడా అందచేశారు. కార్యక్రమంలో కస్తూరి కర్ణాటక జానపద వేదిక తాలూకా అధ్యక్షుడు రామాంజనేయ, భక్తరహళ్ళి ప్రతీశ్, తాలూకా వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు శ్రీరామ్, కట్టడ కార్మిక సంఘం అధ్యక్షుడు వీ దేవప్ప తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ గ్రహీత ఎంకే శ్రీధర్‌కు సత్కారం

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్య, సాంస్కృతిక రంగాలలో నాలుగు దశాబ్దాలపాటు సేవలందించిన డాక్టర్ ఎంకే శ్రీధర్‌కు కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ పురస్కారం ప్రకటించడంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. లాల్‌బాగ్‌లో ఆదివారం శ్రీధర్‌ను శిష్యులతోపాటు మిత్రులు ప్రత్యేకంగా అభినందించారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. జయతీర్థ, సుధ, సురేశ్, లాల్‌బాగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రశంసించారు.



లాల్‌బాగ్‌లో శ్రీధర్‌ను సన్మానిస్తున్న శిష్యులు, మిత్రులు

ఉత్సాహంగా క్రీడా పోటీలు

మహదేవపుర, జనవరి 28: వైట్‌ఫీల్డ్ ఇన్నర్ సర్కిల్ ఆధ్వర్యంలో ఎస్‌బీఆర్ ప్యాలెస్ మైదానంలో నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అరవింద లింబావళి 57వ పుట్టినరోజును పురస్కరించుకుని క్రీడా పోటీలను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే మంజుళా లింబావళి బ్యాటింగ్ చేసి క్రీడాకారులలో స్ఫూర్తి నింపారు. కళ్లకు గంతలు కట్టి నడవడం, ఉట్టి కొట్టడం, చెంచాతో నిమ్మకాయలతో పరుగు, 100 మీటర్ల పరుగు పందెం, మ్యూజికల్ ఛైర్స్ వంటి పోటీల్లో వివిధ విభాగాలలో సాగాయి. క్రికెట్, కబడ్డీ వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న మాజీ మంత్రి లింబావళి పుట్టినరోజును అర్థవంతంగా ఆచరించేలా యువతకు పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నట్టు బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ అధ్యక్షుడు బీఎన్ నటరాజ్, ప్రధాన కార్యదర్శులు నాగేశ్‌రెడ్డి, ఎల్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి



అయోధ్యలో ప్రతిష్ఠించిన బాలరాముడి విగ్రహ శిల్పి అరుణ్ యోగిరాజ్‌ను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆత్మీయంగా సత్కరించారు. రాజ్‌భవన్‌లో ఆదివారం జరిగిన సన్మాన కార్యక్రమంలో అరుణ్‌యోగిరాజ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి- బెంగళూరు)

అలరించిన రామానుజ వైభవం

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యదుగిరి యతిరాజమఠం, కళాప్రేమి ఫౌండేషన్, సంగీత సంభ్రమల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నగరంలోని మల్లేశ్వరం సేవాసదన్‌లో ఏర్పాటు చేసిన రామానుజ వైభవం సంగీత, నృత్య నాటిక అలరించింది. విద్వాన్ పీ రమ దర్శకత్వంలో విద్వాన్ వీణామూర్తి, విజయ్ సంగీత, ఆర్ రఘునందన్‌లు ప్రదర్శించారు. సంగీత అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో ఓ సన్నివేశం

దర్శకుడు మంసోరెపై వరకట్నం కేసు

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ దర్శకుడు మంజునాథ్ సోమకేశవరెడ్డి అలియాస్ మంసోరె తోపాటు కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని, హత మారుస్తామని బెదరింపులకు పాల్పడుతున్నారని భార్య అఖిల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుబ్రమణ్యపుర పోలీస్ స్టేషన్‌లో ఆమె ఆదివారం ఫిర్యాదు చేశారు. మంజునాథ్‌తోపాటు తల్లి వెంకటలక్ష్మమ్మ, అక్క హేమలతలపై ఫిర్యాదుకు అనుగుణంగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కొవిడ్ వేళ సినిమా చిత్రీకరణ కోసం మా కుటుంబ సభ్యులతో భర్త మంజునాథ్ రూ.10లక్షలు తీసుకున్నారన్నారు. ప్రస్తుతం 30లక్షల విలువైన కారు కొనుగోలు చేసి ఇవ్వాలని, భర్త, అత్తలు వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు. కాగా భార్య ఫిర్యాదుపై భర్త మంజునాథ్ కూడా ప్రతిఫిర్యాదు చేశారు. నా భార్య అఖిల మానసిక అస్వస్థతతో చికిత్సలు పొందుతున్నారని పేర్కొన్నారు. నా తల్లిని ఇంటినుంచి బయటకు పంపాలని, నిత్యం గొడవ చేసేవారని ఇటీవలే దాడి కూడా చేశారని భార్య కుటుంబసభ్యుల నుంచి ఎటువంటి నగదు పొందలేదని, ఎటువంటి విచారణకైనా సిద్ధమని పోలీస్ స్టేషన్ వద్ద మీడియాకు తెలిపారు. కాగా మంజునాథ్ రూపొందించిన చిత్రాలలో అరివు, నాతి చరామి, యాక్ట్ 1978, 1920-21 సినిమాలు ఉన్నాయి.

బాలీవుడ్ బిగ్‌బాస్‌లో రాణిస్తున్న భాల్కి యువకుడు

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీదర్ జిల్లా భాల్కి తాలూకా రాచప్పగౌడగావ్ నివాసి అరుణ్ బాబురావ్ మశెట్టి బాలీవుడ్ బిగ్‌బాస్‌లో రాణిస్తున్నాడు. యూట్యూబర్‌గా వ్యవహరిస్తున్న అరుణ్ వివిధ దశలలో ఉత్తమ ప్రక్రియ సాగిస్తూ సత్తా చాటుకున్నాడు. ప్రస్తుతం టాప్-5లో అరుణ్ ఉన్నారు. బంగారం వ్యాపారం కోసం హైదరాబాద్‌కు వెళ్లిన కుటుంబం అక్కడే నివసిస్తోంది. బిగ్‌బాస్ తుదిదశకు చేరడంతో అరుణ్ విజేత కావాలని అతడి మిత్రులు, అనుచరులు భాల్కిలోని పాప నాశలింగంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా మిత్రులు నాగరాజ్, జోగి, ఫిలిప్‌బ్యాన్లీ, రాహుల్, సోనుతోపాటు పలువురు మాట్లాడుతూ జిల్లాకు చెందిన అరుణ్ బిగ్‌బాస్‌లో గెలవాలని కోరుకుంటున్నామన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలకు తగిన చికిత్సలు ముఖ్యం

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో వచ్చే పలు లోపాలను అధిగమించేందుకు తగిన చికిత్సలు ముఖ్యమని అపోలో క్రెడిల్ చిల్డ్రన్ ఆసుపత్రి వైద్య నిపుణులు నిరంజన్ అభిప్రాయపడ్డారు. పుట్టుకతో తలెత్తే రోగాలపై అవగాహన కల్పించే మాసోత్సవం జరుపుతున్నట్లు తెలిపారు. ఈమేరకు శనివారం ప్రత్యేకంగా ఒక ప్రకటన విడుదల చేశారు. జన్యులోపం, పర్యావరణం, జీవనశైలి వంటివి పుట్టకతో వచ్చే లోపాలకు కారణాలుగా ఉండవచ్చునన్నారు. వీటికి తోడు తల్లిదండ్రుల ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు అన్నారు. జీనోమ్ సీక్వెన్సింగ్, ఆఫ్రికన్ ప్రొఫైలింగ్ వంటి అధునాతన జన్యుసాంకేతిక పరిజ్ఞానాన్ని ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. జనన పూర్వ సంరక్షణ, పుట్టిన తర్వాత గమనించే ఆరోగ్య సమస్యల గురించి సమగ్ర పర్యవేక్షణ అనంతరం తగిన చికిత్సల ద్వారా మెరుగు పరచవచ్చునని పేర్కొన్నారు. జన్యుపరమైన సమస్యలకు దీర్ఘకాలం చికిత్సా విధానం అవసరమని అభిప్రాయపడ్డారు. రోగనిర్ధారణ సక్రమ విధానంతో సాగితే అందుకు అనుగుణంగా ఆధునిక చికిత్సలు బాల్యంలో మార్పులు తీసుకురాగలవని అభిప్రాయపడ్డారు.

రేపు బాగేపల్లిలో మానవహారం



సమావేశంలో స్థానిక ప్రముఖులు

బాగేపల్లి, జనవరి 28: మహాత్మాగాంధీ వర్ధంతి నేతృత్వంలో ఈనెల 30న పార్టీలకు అతీతంగా ఏక కాలంలో మానవహారం ఏర్పాటు చేయనున్నట్టు కర్ణాటక తాలూకా సౌహార్ద్రత మానవహార కార్య క్రమ కన్వీనర్ ఏజీ సుధాకర్ తెలిపారు. తాలూకా పంచాయతీ కార్యాలయంలో వివిధ మతాల ప్రముఖులతో సన్నాహక సభ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మానవుల మధ్య సత్సంబంధాలు పెంపొందేలా ఏకకాలంలో మానవహారం ఏర్పాటు చేయదలిచామన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్థానిక ప్రముఖులు మహ్మద్ హజరత్, హైదర్‌వలి, రియాజ్, అబూబకర్, అతావుల్లా, రఘురామరెడ్డి, అశ్వథప్ప, జీ కృష్ణప్ప, హొస జీవన నిలయ ఫాదర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.